## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**తాడికొండ:** కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం బాధ్యతగా తీసుకోవాలని సెయింట్ పాల్స్ సొసైటీ అధ్యక్షుడు బెజ్జం సాయిప్రసాద్ అన్నారు. బడేపురం బీసీ కాలనీలో ఇటీవల మరణించిన కర్ణాటక దేవి కుటుంబ సభ్యులకు సొసైటీ తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మాజీ వార్డు మెంబర్ కాలిశెట్టి శివయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా భావం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. స్థానికులు తాడిబోయిన శ్రీను, గజ్జల వీరయ్య, పందేటి వెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

### డ్వాక్రా మహిళలకు సబ్సిడీతో రుణాలు

**మేడికొండూరు:** డ్వాక్రా సంఘాలలో ఉన్న ఎస్సీ మహిళలకు డీఆర్‌డీఏ వెలుగు ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతి ద్వారా రూ. 50 వేల రాయితీతో కూడిన వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కింద రుణాలు అందిస్తున్నట్లు మేడికొండూరు ఏపీఎం విజయభారతి శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వివిధ గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపులల సభ్యులైన ఎస్సీ మహిళలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ పథకానికి గుంటూరు జిల్లాలో మొదటి విడతగా 82 యూనిట్లకు గాను రూ. 1.64 కోట్లు మంజూరు చేసినట్లు ఏపీఎం చెప్పారు. అర్హులైన మహిళల వయసు 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు లోపు ఉండాలని, లబ్ధిదారులు తప్పనిసరిగా స్థానికులై ఉండి, బ్యాంకు రుణాలు మొండి బకాయిల ఉండకూడదని తెలియజేశారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడికొండ:** విద్యుత్తు లేన్ల మరమ్మతుల కారణంగా నేడు మోతడక 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందని తాడికొండ మండల విద్యుత్ ఏఈఈ ఎస్ నాగమల్లేశ్వర రావు తెలిపారు. కావున మోతడక సబ్ స్టేషన్ పరిధిలోని మోతడక, నిడుముక్కల, లచ్చన్న గుడిపూడి, ముక్కామల, బెజాత్పురం రావెల ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

### వ్యర్థాలు మురుగు కాల్వల్లో వేయవద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

**తెనాలిఅర్బన్:** మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 30వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో చెత్త ఉండటాన్ని గమనించిన ఆమె ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతిరోజు ఇళ్లకు వెళ్ళి చెత్తను సేకరించాలని చెప్పారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, కౌన్సిలర్ కొమరబత్తిని జయపాల్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన

**తెనాలిఅర్బన్:** స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన లభించింది. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పట్టణ వాసులు శనివారం పరిశీలించి పలు వస్తువులు కొనుగోలు చేశారు. ఈసందర్భంగా మెప్మా సీఎంఎం విజయకుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించాలనే ఉద్దేశంతో నెలలో రెండు రోజులు మున్సిపల్ మార్కెట్ వద్ద అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెలలో శుక్ర, శనివారాలలో ఏర్పాటు చేశామన్నారు. పలువురు ఆర్పీలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాలను రూపొందించండి

**తెనాలిఅర్బన్:** విద్యార్థులలో ఐక్యూ పెరిగే విధంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందని నెహ్రూనికేతన్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు.నెహ్రూనికేతన్ లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ది కాకతీయ కో అపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయుల అవగాహన సదస్సును నిర్వహించారు. లీడ్ స్కూల్ వారు టెక్ బుక్ పేరుతో రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. సమావేశంలో లీడ్ స్కూల్ ప్రతినిధులు బీవి సుధాకర్, డి శివారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మూగ జీవాలను బతకనిద్దాం

- కుప్పలు తెప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు
- మనుషుల నిర్లక్ష్యం.. మూగ జీవాలకు ప్రాణాంతకం
- ప్లాస్టిక్ కవర్లు తిని గర్భకోశ వ్యాధులతో మరణం
- నియంత్రణ కరువై విచ్చలవిడిగా వినియోగం
- అధికారులవి కూడా నామ మాత్రపు తనిఖీలే



సాగునీటి కాలువలో విసిరి పడవేసిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు

**తాడేపల్లిరూరల్:** ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. మానవాళికే కాదు..పశుపక్ష్యాదులకు ప్రాణాంతకంగా మారుతోంది. ఇటీవల ఓ మూగ జీవికి ప్రాణాంతకంగా మారడంతో.. ఆపరేషన్ చేసి మరీ ప్లాస్టిక్ వ్యార్థాలను తొలగించిన వార్తలు చూశాం. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలన్న బాధ్యత ఎంతమంది పౌరుల్లో ఉంది. అధికారులు అడపాదడపా దాడులు చేస్తే.. ఆ రోజుకు చర్చింకోవడం మినహా..స్వీయ చైతన్యం ఎంత మందిలో వచ్చింది. బాధ్యతారాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ సాధ్యపడడం లేదు. 120 మైక్రాన్ కన్నా తక్కువ ఉన్న కవర్లు వాడటంతో జరిగే అనర్థాలపై అవగాహన కరువైంది.

**అనర్థాన్ని గ్రహించండి..**

ఎడాపెడా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను రోడ్లపై పడేస్తుండడంతో ఆవులు వాటిని ఆహారంగా తీసుకుని మృత్యువాత పడుతున్నాయి. ఈ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు ప్లాస్టిక్ కవర్లలో తినుబండారాలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలతో రోడ్లపై పడవేస్తున్నారు. గ్రాసం దొరకని పశువులు ఆ ప్లాస్టిక్ కవర్లను తింటున్నాయి. ఈ ప్లాస్టిక్ కడుపులోకి వెళ్లిన తర్వాత విషంగా మారి శరీరమంతటా వ్యాపిస్తోంది. అనంతరం అపస్మారక స్థితిలోకి వెళ్లిన పశువులు వారం పది రోజుల్లోనే మరణిస్తున్నాయి. ఆవుల కడుపులోకి చేరిన ప్లాస్టిక్ అరగకుండా కంతిలా మారి క్రమక్రమంగా శరీరమంతా విషమయమై మృత్యువాత పడుతున్నాయని పశువైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా గోమాతను రక్షించుకోవడానికి ప్లాస్టిక్‌పై ఉద్యమం ప్రకటించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

**విచ్చలవిడిగా వాడకం**

మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో చిల్లర దుకాణాలు, హోటల్స్, చికెన్, మటన్ షాపులు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్‌ల్లో ప్లాస్టిక్‌ను అధికంగా వాడుతున్నారు..వాడుతూనే ఉంటారు. కార్పొరేషన్‌లో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్న అధికారులు దాడులు చేస్తున్నా.. మళ్లీ వినియోగిస్తూనే ఉంటారు. అందుకు సాక్ష్యం రోడ్లపై ఎక్కడ చూసినా కనిపిస్తున్న ప్లాస్టిక్ కవర్లే. కార్పొరేషన్ పరిధిలోని ట్రేడ్ లైసెన్స్ ప్లాస్టిక్ దుకాణాల వ్యాపారులు ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తుంటే.. అనుమతి లేని దుకాణాలు కూడా అంతకు రెట్టింపుగానే ఉన్నాయి. ఈ దుకాణాల ద్వారా విక్రయిస్తున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు రోజుకు టన్నుకు పైగానే ఉంటాయని లెక్కలు చెబుతున్నాయి. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామని, దీనికి పూర్తి స్థాయిలో సహకరించాలని వ్యాపారులను కోరి, నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు..చేస్తూనే ఉంటారు.

### ప్రభుత్వ ఉత్తర్వులు ఇలా

ఇటీవల వరకు 40 మైక్రాన్‌లలోపు ప్లాస్టిక్‌ను నిషేధించిన ప్రభుత్వం.. గతంలో 120 మైక్రాన్‌ల కంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, ఇతరత్రా వస్తువులను మాత్రమే వినియోగించాలని ఉత్వర్వులు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను 100 శాతం నిషేధించాలని ఆదేశించడంతో కొన్ని రోజులు ప్లాస్టిక్ వినియోగం తగ్గింది. తర్వాత పరిస్థితి ఎప్పటిలాగే మారింది. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని ఒక అంశంగా చేర్చి వాటిపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్న పట్టణాలు, నగరాలకు రేటింగ్ ఇస్తూ ప్రభుత్వాలు ప్రోత్సహిస్తోంది.

### అవగాహన కల్పించకుంటే అనర్థాలే



రోడ్డుపక్కనే పడవేసిన ప్లాస్టిక్ డబ్బాలు

ప్లాస్టిక్ వినియోగంతో మనుషులకే కాదు.. జంతువులకు, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. ప్రజలపై ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలని మేధావులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. నిషేధిత ప్లాస్టిక్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

### జంతువులకు ప్రాణహాని



ప్లాస్టిక్ కవరులో ఉన్న ఆహార పదార్థాలను తీసుకెళ్తున్న వానరం

ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి రోడ్లపై పడేయడంతో.. శునకాలు, వానరాలు, ఆవులు ఇతర జంతువులు ఆ కవర్లలో ఉన్న ఆహార పదార్థాలను తింటున్నాయి. ఈ క్రమంలో ఆ కవర్లు వాటి కడుపులోకి వెళ్లి గర్భకోశ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు సోకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి.

### సాగు, తాగునీరు కలుషితం

ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సాగునీటితో పాటు తాగునీరు కూడా కలుషితమవుతోంది. గృహ వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో భద్రపరచి వాటిని తీసుకువెళ్లి సమీపంలో ఉన్న కాలువలు, చెరువుల్లో పడవేస్తున్నారు. ఆ నీటిని మరలా పంపుల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. తాగు నీటితో పాటు సాగు నీరు కూడా కలుషితమవుతోంది.

### ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు అందజేత



**ఫిరంగిపురం:** మండల కేంద్రంలో సీపీఐ జిల్లా, మండల శాఖల ఆధ్వర్యంలో శనివారం ఇళ్ల స్థలాలు లేని పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదల కల నెరవేరాలంటే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఎన్నికల సమయంలో పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల నగదు ఇస్తానని చెప్పారని గుర్తుచేశారు. అనంతరం 600 దరఖాస్తులను సచివాలయంలో అధికారులకు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, మండల కార్యదర్శి షేక్. కరిముల్లా పాల్గొన్నారు.

### అర్హులకే ఇళ్ల స్థలాలు

**ఫిరంగిపురం:** అర్హులైన పేదవారికే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ జె.ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిబంధనలకు లోబడి ఇంటి నివేశన స్థలం మంజూరు చేస్తుందన్నారు. వేశన స్థలం, భూ సంబంధిత, రెవెన్యూ సమస్యలను తహసీల్దారు కార్యాలయంలో తెలియజేయాలన్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మొద్దన్నారు.

### నేడు వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం

**తాడేపల్లి రూరల్ :** దుగ్గిరాల మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు మంగళగిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనల విడుదల చేసింది. ఉదయం 10 గంటలకు మంగళగిరి బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి దుగ్గిరాల నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

## సీపీఎం రాజధాని కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

**తాడికొండ :** తుళ్లూరులో జరిగిన సీపీఎం రాజధాని డివిజన్ మహాసభ తీర్మానాలను శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో నేతలు వివరాలు వెల్లడించారు. పార్టీ రాజధాని డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.రవి, డివిజన్ కమిటీ సభ్యులుగా ఎం.భాగ్యరాజు, జె.నవీన్ ప్రకాష్, కె వెంకటేశ్వర్లు, కుంభ ఆంజనేయులు చేవూరి నందజీ, జి.చెంచయ్య, పేరం బాబురావు, ఎస్ రామరాజు, టి.బక్కిరెడ్డి, ఎస్.ఇమ్మానియేల్, రాజు, ఎర్రమనేని శ్రీనివాసరావు, షేక్ గని ఎన్నికై నట్లు ప్రకటించారు. కొత్తగా ఎన్నికై న నేతలు మాట్లాడుతూ రాజధాని అభివృద్ధి పనులలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే గ్రాంటుగా నిధులు ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్ సెంటర్లు, అసైండ్ భూముల రైతులకు పెండింగ్ ఉన్న వార్షిక కౌలు చెల్లించి, సీడ్ యాక్సిస్ రోడ్డు రైతులకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక వసతులు కల్పించాలని రాజధానిలో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మించి ఉపాధి కల్పించాలని కోరుతూ మహా సభ పలు తీర్మానాలను ఆమోదించింది.



మాట్లాడుతున్న నూతన డివిజన్ సభ్యులు

## జీవనశైలి మార్పులతోనే అలర్జీలకు అడ్డుకట్ట

**మంగళగిరి:** జీవన శైలిలో మార్పులతోనే అలర్జీలకు అడ్డుకట్ట వేయొచ్చని పలువురు వైద్య నిపుణులు తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో ఉన్న ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో రెండు రోజుల సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ నేటి కాలంలో మారిన ఆహారపు అలవాట్లు, జీవన శైలి కారణంగా అనేక రుగ్మతలు పెరుగుతన్నాయన్నారు. అందులో అలర్జీ అధికంగా వ్యాపిస్తోందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో అలర్జీలు అధికంగా పెరగడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. చర్మ వ్యాధులు, అలర్జీలు సంఖ్య పెరుగుతుండడంపై వైద్యనిపుణులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న వాతావరణ కాలుష్యం, పరిస్థితులు కార్బన్ సంబంధిత కాలుష్యంపై మనిషిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కొన్ని సందర్భాల్లో డ్రగ్స్‌కు కూడా అందని విధంగా అలర్జీలు పెరుగుతున్నాయన్నారు. ఉబ్బసంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుందన్నారు. నూతన పరిశోధనలు ఆవిష్కరణలు దిశగా సాగుతున్న అంశాలపై పలువురు చర్చించారు. ముఖ్యంగా జంక్ ఫుడ్‌ల ప్రభావం అధికంగా వుందన్నారు. ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్రమణ్య శాస్త్రి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, జాతీయ పిల్లల అలర్జీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్, డాక్టర్లు కె మరళీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్, వి.రఘురామిరెడ్డి, వై సంధ్య తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో సదస్సు ప్రారంభం

## రాజ్యాంగం మెజార్టీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

**తెనాలి:** భారత రాజ్యాంగం దేశంలోని మెజారిటీ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చినపుడే అందరూ దాన్ని సొంతదిగా భావిస్తారని, రాజ్యాంగానికి, ప్రజలకు మధ్య అనుసంధానం ఉండాలని విప్లవ రచయితల సంఘం నాయకుడు సీఎస్ఆర్‌కే ప్రసాద్ అభిప్రాయపడ్డారు. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో 'భారత రాజ్యాంగం: మంచి చెడు' అనే అంశంపై చర్చావేదికను నిర్వహించారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఏర్పాటైన ఆ చర్చాగోష్టికి సమన్వయకర్తగా జీఎస్ నాగేశ్వరరావు వ్యవహరించారు. సీఎస్ఆర్‌కే ప్రసాద్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, 75 ఏళ్ల సుదీర్ఘకాలంలో రాజ్యాంగం ప్రకారంలో పేర్కొన్న లక్ష్యాలను ఏమేరకు సాధించాం, ఆచరణలో ఎంతవరకు విజయవంతమైందీ చర్చ జరగాలన్నారు. రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న సామ్యవాదం, లౌకికవాదం గురించి స్పష్టత లేదన్నారు. రాజ్యాంగంపై చర్చ ఆచరణవైపు నుండి జరగాలనీ, న్యాయమూర్తులు కూడా భిన్నమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, పాలకవర్గాలు అస్పష్టతను కొనసాగిస్తున్నాయని వివరించారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రాజనీతి శాస్త్ర ఆచార్యుడు వి.అంజిరెడ్డి మాట్లాడుతూ చాలా దేశాలకు భిన్నంగా, భారతదేశం స్వాతంత్ర్యం సమకూరిన వెంటనే ఆధునిక రాజ్యాంగాన్ని రూపొందించుకుని ప్రజాస్వామ్య పాలనకు దిగటమనే సాహసానికి పూనుకుందని చెప్పారు. భారత్‌లో ఇది ఎక్కువ కాలం నిలిచేది కాదని భావించిన పాశ్చాత్యులు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య భావనలో చాలా పరిమిత హక్కులను గ్రహింపగలగటం వల్లనే ప్రజాస్వామ్యం కొనసాగుతోందని చెప్పారు. రాజ్యాంగం అనే పదం సరైంది కాదనీ, రాజ్యశాసనంగా సాధ్యమైనంత తర్వగా మార్చుకోవాలన్నారు. సమన్వయకర్త జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాజ్యాంగంలోని వయోజనవిద్యతో పేదరికం గణనీయంగా తగ్గిందనీ, ఓటు హక్కుతో రాజకీయ సమానత్వం ప్రసాదించిందనీ, సామాజిక సమానత్వంలోనూ ఒక అడుగు ముందుకు పడిందన్నారు. సంస్థ కన్వీనర్ కేవీ రాఘవరెడ్డి స్వాగతం పలికిన సభలో జుగాష్‌విలి, ఉమారాజశేఖర్, పిల్లి వాసు, కనపర్తి బెన్‌హర్, వై.అశోక్‌కుమార్, లలితానంద ప్రసాద్, దేవిశెట్టి కృష్ణారావు, జాలాది మోజెస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎస్ఆర్‌కే ప్రసాద్

### సీజనల్ వ్యాధులపై అవగాహన



**ఫిరంగిపురం:** మండలంలోని పొనుగుపాడు గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వైద్యురాలు అస్రిఫ్ 145 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యురాలు అస్రిఫ్ మాట్లాడుతూ శీతాకాలం కావడంతో గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని, వేడిగా ఉండే ఆహారం తీసుకోవాలని చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చిన్నారులకు చలి తగలకుండా వెచ్చగా ఉండేలా చూడాలని తెలిపారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో తగిన మందులు తీసుకొని వాడాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం కొర్నేలియా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి

**తాడేపల్లిరూరల్ :** కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధచూపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకాన్ని అమలు చేస్తోందని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం కమిషనర్ ఎంటీఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం అమలులో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో రూ.20 వేల రాయితీ కల్పిస్తూ అమలు చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకంలో 3 కేవీ సోలార్ ఏర్పాటు చేసుకోవాలంటే రూ.2 లక్షలు ఉండగా సోలార్ ప్యానెకు రూ.78 వేల సబ్సిడీతో కేవలం రూ. 1.22 లక్షలకే వేలకే ఏర్పాటు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. పూర్తి వివరాలకు 62817 02843 నెంబరుకు సంప్రదించాలన్నారు.

## విశ్రాంత ఎస్సై డేవిడ్ రాజుకు సన్మానం



**మేడికొండూరు:** విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వ్యక్తి ఎస్సై డేవిడ్ రాజు అని మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఎం.డేవిడ్ రాజు పదవి విరమణ కార్యక్రమం శనివారం మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో ఘనంగా జరిగింది. సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు ఉద్యోగం ప్రతి ఒక్కరికి ఒక సేవా దృక్పథం లాంటిదని ఆ దిశగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. నాగూర్‌మీరాసాహెబ్ దంపతులను పూలమాలతో, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం సిఐ రవీంద్రబాబు, మేడికొండూరు ఎస్సై ఖాజీబాబు, ఏఎస్ఐ శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, కోటయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో గీతాంజలి విద్యార్థుల సత్తా

**తాడేపల్లిరూరల్ :** క్రీడా పోటీల్లో తాడేపల్లి గీతాంజలి విద్యార్థులు సత్తా చాటారు. క్రీడాకారులను శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష కార్యదర్శులు రావూరి రమేష్ బాబు, సుకుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించి, అభినందించారు. రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. స్కూల్ కరస్పాండెంట్ మున్నంగి రమాదేవి మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, సత్తా చాటించారని తెలిపారు. అనంతరం క్రీడాకరులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, మెడల్స్ బహూకరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కోశాధికారి ఆరిగకూటి రవీంద్రరెడ్డి, సభ్యులు చంద్ర ఓబులా రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, కొంటిపాటి నరేంద్ర, బొంతు అప్పిరెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులతో యాజమాన్యం, రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్ష, కార్యదర్శులు

## అకిరా బీజీ పత్తి విత్తనాల ప్రదర్శన

**మేడికొండూరు:** కొరప్రాడు గ్రామంలో పోతంశెట్టి శివరామయ్య పొలంలో తులసి సీడ్స్ అకిరా బీజీ 2 పత్తి విత్తనాలపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. తులసి కంపెనీ జోనల్ మేనేజర్ షేక్ మౌలానా రఫీ మాట్లాడుతూ అకిరా బిజీ 2 పత్తి రకం అన్ని రకాల నేలలకు అనువుగా ఉంటుందని తెలిపారు. సారవంతమైన నేలపై నెమ్ము, బెట్టనైనా తట్టుకుంటుందని, గులాబీ రంగు పురుగుని సమర్థంగా ఎదుర్కొంటుందన్నారు. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో కూడా రైతుకి పెట్టుబడి నష్టం లేకుండా చేస్తుందన్నారు. గ్రామానికి చెందిన రైతు శివరామయ్య మాట్లాడుతూ ఇప్పటికి ఎకరాకు 10 క్వింటాళ్ల పత్తి తీసినట్లు ఇంకా 10 క్వింటాళ్లకి పైనే దిగుబడి వస్తుందన్నారు. రైతులందరు అకిరా విత్తనాలు వాడి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఫిరంగిపురం, మేడికొండూరు, సత్తెనపల్లి మండలాల్లోని 25 గ్రామాల నుంచి 500 మంది పైగా రైతులు హాజరై హర్షాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, శేఖర్, శోభన్ బాబు, గజేంద్ర వెంకట్, ఆర్. ఎం .వీరెళ్ళ చంద్రశేఖర్, ఏరియా మేనేజర్ కృపారావు, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న తులసి కంపెనీ సిబ్బంది

## ఆకట్టుకున్న బృందగానం

**తెనాలి:** పట్టణ నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సమేత గోవర్ధనస్వామి/ శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం శ్రీహరి నామ సంకీర్తన బృందంచే సంకీర్తన గానం జరిగింది. గురువు పెరవలి వంశీకృష్ణ ,అందె బాలచంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి, మాదల నాగఅర్చన, రూపశ్రీ, కొత్తమాసు పుష్పలత, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణుప్రియ, శ్రీపూజిత, వేమవరపు లక్ష్మి నరసింహారావు, టీవీఎస్ శాస్త్రి సంకీర్తనలలో పాల్గొన్నారు. శ్రీఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మినారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం చేశారు. ప్రతి శనివారం హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానములు సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి శనివారం గోవర్ధన స్వామి దేవాలయంలో వారం భజన ఉంటుందనీ, డిసెంబర్ నెలలో తిరుమలలో ఇదే బృందంచే భక్తిరంజని ఉంటుందని గురువు పెరవలి వంశీకృష్ణ తెలియజేశారు.



సంకీర్తనలు గానం చేస్తున్న గాయకులు